సాక్షి జనగామ

బుధవారం | 19 | జూన్ | 2024



ప్రగతిలో వరంగల్ డీసీసీబీ

డీసీసీబీ ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని ఆ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు.

- 8లో▸



అమ్మలా ఆలనాపాలన..

తల్లిదండ్రులు కోల్పోయిన అనాథలు, వివిధ లోపాలతో అప్పుడే పుట్టిన శిశువులకు 'శిశు గృహ' అమ్మ ఒడినందిస్తోంది.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$33^0/26^0$

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మహిళలకు సత్కారం

నర్మెట: సాధికారత దిశగా నర్మెట సెర్ప్ మహిళలు ఉన్నారని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. నర్మెట మండలంలోని డీఆర్‌డీ సెర్ప్ కింద మహిళలు బ్యాంక్ లింకేజీ పథకం ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.16కోట్ల లక్ష్యం కాగా రూ.30 కోట్ల ప్రగతి సాధించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో మహిళలు, అధికారులు, బ్యాంక్ మేనేజర్‌ను మంత్రి సీతక్క చేతుల మీదుగా పురస్కారం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్ మహిళలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మొగిలప్ప, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

జనగామ రూరల్: స్పోర్ట్స్ స్కూల్ నాలుగో తరగతిలో ప్రవేశాలకు విద్యార్థిని విద్యార్థులు ఎంపికకు సిద్ధం కావాలని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ నాలుగో తరగతిలో ప్రవేశాలకు మండల స్థాయిలో ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఎంపిక కార్యక్రమం చేపట్టిందని, మండల స్థాయిలో ఎంపికైన వారికి ఈ నెల 29న జిల్లాస్థాయిలో ధర్మకంచలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఎత్తు, బరువు, 30 మీటర్స్ ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బోర్డ్ జంప్, 800 మీటర్స్ రన్, షటిల్ రన్, మెడిసిన్ బాల్పుట్, వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ వంటి అంశాల్లో ఉత్తీర్ణులవ్వాలని తెలియజేశారు. స్పోర్ట్స్ స్కూల్లో చేరే విద్యార్థులు 2015 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. విద్యార్థులు సమర్పించవలసిన ధ్రువీకరణ పత్రాలు స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం దిగిన 10 పాస్ ఫొటోలు, మూడో తరగతి ప్రోగ్రెస్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రము వంటి ధ్రువీకరణ పత్రాలతో అర్హత గల విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే ఎంపికకు ఈనెల 29వ తేదీన ఉదయం 8:30 గంటలకు ధర్మకంచ లోని మినీ స్టేడియంలో హాజరు కావాలన్నారు.

'నిట్'లో ఓపెన్‌హౌస్‌కు విశేష స్పందన



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ఓపెన్‌హౌస్ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ హాజరై మాట్లాడారు. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులు జోసా, సీసాబ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉత్తమ ఇంజనీరింగ్ కళాశాలలను ఎంచుకోవాలని, ఏమరుపాటుతో కళాశాలల్లో అడ్మిషన్లను చేజార్చుకోవద్దని సూచించారు. నిట్ వరంగల్ క్యాంపస్‌లో ఓపెన్‌హౌస్ పేరుతో జోసా అడ్మిషన్ల ప్రక్రియపై అవగాహన కల్పించడం హర్షణీయమని పేర్కొన్నారు. 11 బీటెక్ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాంలలో మూడు కోర్సుల వివరాలు, నిట్‌లో విద్యాబోధన, ల్యాబ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడ్మిషన్స్ అసోసియేట్ డీన్ రవిచంద్ర, ప్రొఫెసర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పేరిణి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



హన్మకొండ కల్చరల్ : పేరిణి నృత్య శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, వరంగల్ నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజులపాటు నిర్వహించనున్న పేరిణి నృత్య శిక్షణ శిబిరం వాల్‌పోస్టర్‌ను సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పేరిణి నృత్య గురువు గజ్జెల రంజిత్ మాట్లాడుతూ మంగళవారం నుంచి జూలై 17 వరకు వరంగల్ బ్యాంకు కాలనీలోని పేరిణి నృత్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఎస్‌ఆర్‌ఐ సుభాష్, ఒగ్గు కళాకారులు రవి, కేంద్ర జాతీయ యువపురస్కార గ్రహీత, పేరిణి కళాకారులు పేరిణి రాజ్‌కుమార్, వరంగల్ విద్యారణ్య సంగీత నృత్య కళాశాల అధ్యాపకురాలు చాతరాజు నవ్యజ, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ అధ్యక్షురాలు మోత్కూరి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా | రైతుకు ధీమా

- ఈ సీజన్ నుంచి అమలుకు యోచన
- ప్రీమియం చెల్లించనున్న ప్రభుత్వం
- కసరత్తు చేస్తున్న వ్యవసాయ శాఖ
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు
- జిల్లాలో 3.70 లక్షల ఎకరాల సాగు



క్రాప్ బుకింగ్ చేస్తున్న ఏఈఓ (ఫైల్)

జనగామ రూరల్: అకాల వర్షాలు విపత్తుల నుంచి పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఈ వర్షాకాల సీజన్ నుంచి ఫసల్ బీమాను అమలు చేయనుంది. గత రెండు సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా క్రాప్ బుకింగ్ కింద పంటల నమోదు ప్రక్రియ ప్రారంభించగా 17 మండలాలు పైలట్ ప్రాజెక్ట్ కింద జనగామ మండలం ఎంపిక కాగా క్రాప్ బుకింగ్ విజయవంతం చేశారు. దీనిని పూర్తి స్థాయిలో అమలు చేసే విధంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరడం, ప్రీమియం చెల్లింపు, బీమా పరిహారం వంటి అంశాలపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. 2016లో బీమా పథకం ప్రారంభం కాగా 2020 వరకు అమలులో ఉంది. అనంతరం పంట బీమా వర్తించలేదు. ఈ నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు మళ్లీ పంటల బీమా అమలు చేయనున్నారు.

గతంలో ఇలా..

గతంలో పంటల బీమాకు ప్రీమియం కింద 95 శాతం కేంద్రం, 5 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది. పరిహారం పొందడంలో సమస్యలు ఉండడంతో రైతులకు ఉపయోగం లేదనే కారణంలో బీమా పథకాన్ని అమలు చేయలేదు. అయితే నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఫసల్ బీమా పథకం అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు ప్రీమియం మొత్తం చెల్లించాలని నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా 3 లక్షల ఎకరాల్లో సాగు అవుతుండగా వరి, పత్తి, మొక్కజొన్న, కందులు ఇతర పంటలు పండిస్తున్నారు.

పక్కాగా అమలు..

ఈ సీజన్‌లో పంటల బీమా పథకం పక్కాగా అమలు చేయనుంది. ఇందుకు గాను ఇప్పటికే క్లస్టర్ల వారీగా వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్‌ను పరిగణలోకి తీసుకొని ముందుకు పోతున్నారు. అధికారుల పొరపాట్లతో ఉత్పత్తుల క్రమ విక్రయాలు, పంట నమోదుపై గొడవలు జరుగుతుండడంతో బీమాను పకడ్బందీగా అమలు చేయనున్నారు.ఇందుకు బీమా కల్పనలో బయోమెట్రిక్‌తో పాటు రైతుల నుంచి డిక్లరేషన్ తీసుకోనున్నారు.



బీమా లక్ష్యాలు

- వైపరీత్యాలతో పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం అందించడం.
- రాష్ట్రంలో సాగు రైతుల ఆదాయాన్ని స్థిరీకరించడం.
- వినూత్న ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించేలా రైతులను ప్రోత్సహించడం.
- రైతుల రుణ అర్హతను నిర్ధారించి, పంటల వైవిధ్యం, పంటల్లో పోటీతత్వం పెంపొందించడం
- పత్తికి వాతావరణ ఆధారితగా గ్రామం ఒక యూనిట్‌గా ఇతర పంటలకు మండలం ఒక యూనిట్‌గా బీమా అమలు చేస్తారు.
- ప్రీమియం, పరిహారం, బీమా ఎలా అమలు అనేది తెలాల్సి ఉంది.

జిల్లాలో సాగు వివరాలు (ఎకరాల్లో)

మండలం	వరి	పత్తి	కందులు	ఇతర పంటలు	మొత్తం
చిల్పూరు	19,000	4,500	350	540	24,390
స్టేషన్‌ఘన్‌పూర్	17,000	8,500	990	750	27,240
లింగాలఘనపురం	15,000	16,000	1,600	150	32,750
రఘునాథపల్లి	22,500	22,500	680	550	46,230
జఫర్‌గఢ్	14,000	13,000	350	550	27,900
బచ్చన్నపేట	29,000	3,000	750	150	32,900
జనగామ	23,000	5,500	380	100	28,980
నర్మెట	13,500	7,500	350	150	21,500
తరిగొప్పుల	7,500	10,500	350	500	18,850
దేవరుప్పుల	18,500	17,500	17,500	400	38,150
కొడకండ్ల	11,500	11,000	900	400	23,800
పాలకుర్తి	19,500	25,500	1,550	760	47,310
మొత్తం	2,10,000	1,45,000	10,000	5,000	3,70,000

రైతులకు ప్రయోజనకరం



ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు రైతులకు ఆర్థికంగా అదుకునేందుకు బీమా పథకం ఉపయోగపడుతుంది. ఈ వానాకాలంలో పంటల బీమా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిక చేసిన ప్రాంతాలకు పంటల బీమా వర్తింపజేస్తారు. ఇందుకు ప్రభుత్వం ప్రీమియం చెల్లిస్తుంది. వాతావరణ ఆధారిత బీమా, ఫసల్ బీమా రెండు విధాలుగా అమలు అవుతుంది.

- వినోద్‌కుమార్, వ్యవసాయాధికారి

సద్వినియోగం చేసుకోవాలి



గత ప్రభుత్వం రైతులకు మేలు చేసే విధంగా తగు నిర్ణయాలు తీసుకోకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో ఉన్న అన్ని వర్గాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని లబ్ధి పొందాలి.

- సుంకరి శ్రీనివాస్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ

సమస్యలపై ప్రస్తావన లేని సమావేశం

- కొటేషన్లు.. బిల్లుల చెల్లింపులకే ఎజెండా అంశాలు
- అదుపుతప్పిన శానిటేషన్ నిర్వహణ
- మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో షాడో ఎవరు..?
- ఎంక్రోచ్‌మెంట్లపై కరువైన నిఘా...
- నేడు కౌన్సిల్ సమావేశం



జనగామ: జనగామ పురపాలిక సమావేశాలు సమస్యల ప్రస్తావన లేకుండానే ముగించేస్తున్నారు. వార్డుల వారీగా కౌన్సిలర్లు లేవనెత్తుతున్న అంశాలను పరిగణలోకి తీసుకోకుండానే.. మరుసటి నెల సర్వసభ్య సమావేశానికి సిద్ధమవుతున్నారు. బిల్లుల చెల్లింపులు.. కొత్తగా కొటేషన్లకు సంబంధించిన ఎజెండా అంశాలు మినహా.. కాలనీల్లో కనీస మౌలిక వసతి సౌకర్యాలను గాలికి వదిలేస్తున్నారు. నాలుగేళ్లుగా అడుగుతూనే ఉన్నాం... చిన్న పని కూడా చేయలేక పోతున్నామని ప్రతీ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ఆవేదన వెలిబుచ్చడమే తప్ప.. ఏమీ చేయలేక పోతున్నారు. నేడు (బుధవారం) మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య అధ్యక్షతన 26 ఎజెండా అంశాలతో కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ముందుగా ఖర్చు చేసిన పనులకు బిల్లుల చెల్లింపు, కొత్తగా కొటేషన్లను ఆహ్వానించడం మినహా.. 30 వార్డుల పరిధిలో చేపట్టబోయే పనుల గురించి పెద్దగా ప్రస్తావించలేదు.

ఎజెండా అంశాలు ఇవే...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పురపాలిక భవనంతో పాటు ప్రహరీ గోడలు, బస్టాండు చౌరస్తా, అంబేడ్కర్ విగ్రహం వద్ద లైటింగ్ నిర్వహణ కోసం సాధారణ పద్దు నుంచి రూ.60వేలు ఖర్చు చేసినట్లు ఎజెండాలో పేర్కొన్నారు. వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేయడం, బోర్ వెల్స్, పంప్స్ ఫ్లషింగ్, మరమ్మతు, పైపులైన లీకేజీ మెటీరియల్ కొనుగోలు, నీటి సరఫరా నిర్వహణ పనుల కోసం అసిస్టెంట్టు, మునిసిపాలిటీస్ ఫర్ డెవలప్‌మెంటు వర్క్స్ స్కీం నిధుల నుంచి రూ.14.30 లక్షలు చెల్లింపులకు కౌన్సిల్ ముందుకు తీసుకు రానున్నారు. కాగా ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లో నూతనంగా ప్రింటర్ కొనుగోలుకు రూ.25వేలు తదితర వాటి కోసం నిధుల ఖర్చు, చెల్లింపుల నేపథ్యంలో నేడు జరిగే సమావేశంలో మెజార్టీ సభ్యుల ఆమోదం తీసుకోనున్నారు.

మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో షాడో ఎవరు..?

ఇటీవల పురపాలికలలో మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో అక్రమాలు చోటు చేసుకోగా... విచారణ పక్కదారి పట్టించారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కమిషనర్ పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది పుర పాలికకు సంబంధం లేకుండా ఎప్పుడో మృతి చెందిన వారి పేర్లను.. మున్సిపల్ పరిధిలో ప్రస్తుతం జరిగినట్లు నమోదు చేయడం వెలుగు చూడగా, చర్యలు నామమాత్రంగా ఉన్నాయనే ఆరోపణలు లేకపోలేదు. ఎంక్రోచ్ మెంట్లపై పర్యవేక్షణ గాలికి వదిలేయగా, ఇంటి అనుమతుల జారీలో అడ్డగోలు వ్యవహారం నడుస్తున్నట్లు సమాచారం.

తూతూ మంత్రంగానే...



నిధుల ఖర్చు, చెల్లింపుల కోసం ఎజెండా అంశాలు కౌన్సిల్ దృష్టికి తీసుకు రావడమే తప్ప, వాటికి సంబంధించిన పూర్తి వివరాలు చూపించడం లేదు. వాహన రిపేర్లు, కొత్త టైర్ల కొనుగోలుకు రూ.8 లక్షలు ఎజెండాలో చూపించారే తప్ప, సమగ్ర సమాచారం కనిపించడం లేదు. నూతన టైర్ల కొనుగోలు చేసే అధికారులు, పాత వాటి సంగతి తేల్చాలి. రీట్రేడింగ్ ఎందుకు చేయించడం లేదు. కొత్తగా బ్లీచింగ్ కొనుగోలుకు నిధులు అవసరమని ఎజెండా చూపిస్తున్నారు. ఎజెండా అంశంలో ప్రతీ పైసా పక్కదారి పట్టించే విధంగా ఉంది.

- గాదెపాక రాంచందర్, కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలోని 174 సర్వేనంబర్‌లో గుడిసెలను వేసుకున్న వారికి పక్కా ఇంటి స్థలాలను ఇచ్చే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా నాయకులు సుంచు విజేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చిన్నరామన్‌చర్ల, పోచన్నపేట, తమ్మడపల్లి, నక్కవానిగూడెం, ఇటుకాలపల్లి, రామచెంద్రాపూర్, లింగంపల్లి, నాగిరెడ్డిపల్లి, గంగాపూర్, ఆలింపూర్, కట్కూర్, బండనాగారం, కొడవటూర్, కేసిరెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు ప్రజలు ప్రభుత్వ భూమిలో గుడిసెలను వేసుకున్నారని, వీరందరికీ స్థలాలను కేటాయించేవరకు ఈ స్థలాన్ని విడిచివెళ్లమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పేదలకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ వెంకటేష్, ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్: వైద్యులు విధిగా సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రిజిస్టర్లు, ఫైళ్లు పరిశీలించారు. ఓపీ, ఇన్‌పేషెంట్, ఎమర్జెన్సీ సేవల రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది అందరూ విధులకు హాజరు అయ్యారా అని ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. వార్డులో ఉన్న రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రి ఉందని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఆస్పత్రిలో ఓపీ పెంచాలని, ప్రస్తుతానికి రోజుకు 95 నుంచి 140 వరకు ఓపీ ఉంటుందని, రోజుకు 200 ఓపీ ఉండేలా పని చేయాలన్నారు. ఆస్పత్రిలో మైనర్ రిపేర్లు ఉన్నాయని, మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్, వైద్యులు డాక్టర్ జనార్దన్, డాక్టర్ శంకర్, డాక్టర్ ప్రసన్నకృష్ణ, డాక్టర్ సుమన్, డాక్టర్ రవి తదిరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీ

జఫర్‌గఢ్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం జఫర్‌గఢ్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు, ధరణి రికార్డులు, మధ్యాహ్న భోజన అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పెండింగ్ దరఖాస్తులను ప్రణాళిక బద్ధంగా పరిష్కరించాలన్నారు. అలాగే కేజీబీవీ, జెడ్పీ పాఠశాలలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాము, తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీఓ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సౌకర్యాలు నిల్

- ప్రజాపాలన దరఖాస్తులపై ప్రశ్నలు
- గరంగరంగా జెడ్పీ సర్వసభ్య సమావేశం
- పాల్గొన్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

జనగామ రూరల్: ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం లేదని, జిల్లాలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రశ్నించారు. మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లింగాలఘణపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఆస్పత్రిలో ఇప్పటికి సిటీ స్కాన్ మిషన్ రాలేదని, జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో వైద్య సౌకర్యాలు సరిగా లేవని, వైద్యులు సరిగా పని చేయడం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రఘునాథపల్లి జెడ్పీటీసీ బొల్లం అజయ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ విస్తరణ అధికారులు సరిగా పని చేయడం లేదని, ఏ పంటలు ఎప్పుడు వేసుకోవాలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించలేదన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల నమోదులో పలు సమస్యలు వస్తున్నాయని, అధికారులు వాటిపై స్పష్టత ఇవ్వకుండా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని జఫర్‌గఢ్ జెడ్పీటీసీ బేబిరాణి అధికారులను అడిగారు. వీరితో పాటు మరికొంత సభ్యులకు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గత రెండు పర్యాయాలు సర్వసభ్య పాలకమండలి సమావేశంలో దివంగత జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి లేక పోవడంపై సభ్యులు వారి సేవలను కొనియాడారు.

సమష్టి నిర్ణయాలతో అభివృద్ధి సాధించాలి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి సమష్టి నిర్ణయాలతో అభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. జిల్లా ప్రగతిపై తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

ఖాకీచకుడు..



స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుల్‌పై వరుసగా అత్యాచారం

- ఎవరికైనా చెబితే చంపేస్తానని తుపాకీతో బెదిరింపులు
- నోరు తెరిస్తే.. బూతు పురాణం
- చికెన్ కోసం చిల్లర బుద్ధి
- పనిచేసిన ప్రతీచోట రాసలీలలు..
- కాటారం సబ్‌డివిజన్‌లోని ఎస్‌ఐ బాగోతం
- అతనిపై లైంగిక వేధింపుల కేసు?

పోలీసులు అంటే ఒక నమ్మకం.. ప్రజల మాన, ప్రాణాలు కాపాడేవారని భరోసా. కానీ ఓ సబ్ ఇన్‌స్పెక్టర్‌ని చూస్తే ఆ స్టేషన్‌లోని వారికే ఒక చిరాకు.. స్త్రీలోలుడు.. గతంలో పనిచేసిన చోటా ఇదే పని.. కన్నేసిన ఆడవారిని అనుభవించేదాకా వదలడు. అందుకు ఎంతదూరమైనా వెళ్తాడు. తన సర్వీస్ రివాల్వర్‌తో బెదిరించి మరీ తన కామవాంఛ తీర్చుకుంటాడు. అలాంటి ఘటనే ఇది. సొంత స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుల్‌పై అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. ఆమె ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ పోలీస్ కామాంధుడి అరాచకాలు ఆ సబ్ డివిజన్‌లో హాట్‌టాపిక్‌గా మారాయి.

– వరంగల్‌క్రైం

ఆ సబ్ ఇన్‌స్పెక్టర్ పేరులోనే దేవత ఉంటుంది. కానీ అతను.. మహిళలంటే కేవలం కోరికలు తీర్చే వస్తువు అనుకుంటాడు. అతను పనిచేసేది జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్‌లోని ఓ స్టేషన్‌లో. ఇరవై రోజుల క్రితం తనకు కాలు విరిగింది.. ఇంటికి వచ్చి సాయం చేయమని తన స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుల్‌ను వేడుకోగా, తను మానవత్వంతో ఇంటికి వెళ్తే తుపాకీతో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయట తెలిస్తే చంపేస్తానని బెదిరించడంతో ఆమె బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది. ఈ క్రమంలోనే 2రోజుల క్రితం మళ్లీ ఆమె ఇంటికి వచ్చిన సదరు ఇన్‌స్పెక్టర్ మరోసారి అత్యాచారానికి పాల్పడ్డాడు. తనకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆమె తనలో తాను కుంగిపోతోంది. సదరు సబ్‌ఇన్‌స్పెక్టర్ రాసలీలలే కాదు.. మరిన్ని బాగోతాలు ఉన్నట్లు కాటారం డివిజన్‌లో చర్చ జరుగుతోంది. ఇతని వ్యవహారశైలిపై 'సాక్షి'కి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు.. అతను నోరు తెరిస్తే బూతు పురాణం. పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలంటే మహిళలకు వణుకు పుడుతుంది. తన ఎదురుగా వెళ్తే నోటికొచ్చిన మాట అనేయడం ఆయనకు సర్వసాధారణం. గతంలో ఫిర్యాదుదారులతో నోటికి వచ్చినట్లు మాట్లాడి పలుమార్లు ఉన్నతాధికారుల చేతుల్లో చీవాట్లు తిన్నా ఆయన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. చీవాట్లు తప్ప కఠిన చర్యలు తీసుకునే వారు లేరన్న ధీమాతో ఆయన తిట్లకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.

పనిచేసిన ప్రతీచోట రాసలీలలు

ప్రజల ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వం ఇచ్చిన సర్వీస్ రివాల్వర్‌ను అడ్డుపెట్టుకుని రాసలీలలు చేయడంలో తనకు తనే సాటి. గతంలో పనిచేసిన మంచిర్యాల జిల్లాలో ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించి సస్పెండ్ అయిన ఘన చరిత్ర ఆయనది. తన దగ్గర పనిచేసే మహిళా సిబ్బందిని డబుల్ మీనింగ్ డైలాగ్‌లతో ఇబ్బందికి గురిచేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. 'నేను అందంగా లేనా... నన్ను వద్దంటావా...? కారణం చెప్పవా.. అనే మాటలు ఆయన దగ్గర పనిచేసే మహిళా సిబ్బంది, ఫిర్యాదుదారులు ఒక్కసారైనా ఎదుర్కోవాల్సిందే. అవసరం లేకున్నా రాత్రి వరకు మహిళా సిబ్బందిని స్టేషన్‌లో ఉంచుకుని హింసపెట్టడం తన దినచర్యలో భాగం.

చికెన్ కోసం చిల్లర బుద్ధి..

ఆయన పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో 15 చికెన్ సెంటర్లు ఉన్నాయి. రోజూ ఒక సెంటర్ పావు కిలో చికెన్ తనకు వంతుల వారీగా పంపించాలని సమావేశం పెట్టి మరీ హుకుం జారీ చేయడం గమనార్హం. ఇక ఆ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు, ఇసుక ట్రాక్టర్లు, వేబ్రిడ్జి కాంటాల యజమానులకు ఫోన్లు చేసి మామూళ్లు వసూలు చేయడంతో ఆయనకు సాటి లేరు. ఆయన వసూళ్లు రూ.100 నుంచి మొదలవుతాయంటే ఎంతగా దిగజారాడో తెలిసిపోతోంది. కాగా, విషయం తెలియడంతో డీఎస్పీ సదరు స్టేషన్‌కు వెళ్లి విచారణ జరిపినట్లు తెలిసింది. ఆ ఎస్‌ఐ నుంచి రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అతనిపై ఎస్టీ, ఎస్టీ అట్రాసిటీ, లైంగిక వేధింపుల కేసు నమోదు చేయనున్నట్లు తెలిసింది.

నేను మంత్రి మనిషిని..

ఆయన నోట తరచూ వినిపించే పదం నేను మంత్రి మనిషిని.. నాకేం కాదు. ఇది చెప్పుకుంటూ పై అధికారులను మొదలుకొని కింది సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతగాని బెదిరింపులు భరించలేక ఆ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ ఏఎస్సై, ఓ హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ బదిలీ చేసుకుని వెళ్లినట్లు సమాచారం. చోటామోటా నాయకులు స్టేషన్‌కు వస్తే చాలు... అందరికి వినిపించేలా 'బాబన్న బాగుండా.. నాకు ఇంతకుముందే ఫోన్ చేసిండు' అంటూ తనకు తానే డప్పు కొట్టుకోవడం కనిపిస్తుంటుంది. ఆ జిల్లాకు చెందిన ఓ మంత్రి పేరుతో పోలీస్ అధికారులను, సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్న రాసలీలల ఘనుడి విషయం ఉన్నతాధికారులకు తెలిసినా చర్యలు తీసుకోకపోవడంతో... తన కామవాంఛలను పనిచేసిన ప్రతీచోట మహిళా సిబ్బందిపై తీర్చుకుంటూ పోతున్నాడు. ఇలాంటి ఖాకీచకులపై పోలీస్‌శాఖ చర్యలు తీసుకోకుంటే మహిళలు ఆ శాఖకు రావాలంటేనే భయపడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో దృష్టి పెడితే ఇలాంటి ఘనుల బాగోతం వెలుగు చూసే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

శునకానికి అంత్యక్రియలు..



మండలంలోని దాట్లకు చెందిన గొడుగు మధు ఏడు సంవత్సరాల నుంచి ఓ కుక్క(జూలి)ను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నాడు. అయితే జూలి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మనుషుల మాదిరిగా జూలి అంత్యక్రియలు నిర్వహించాడు. ఈ సందర్భంగా కన్నీరుమున్నీరుగా విలపించాడు.

-దంతాలపల్లి

మద్యం తాగుతూ.. విధి నిర్వహణ

● సోషల్ మీడియాలో వైరల్



విధి నిర్వహణలో మద్యం తాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న డేటా ఎంట్రీ అసిస్టెంట్ ఒకరు మద్యం తాగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ విషయం మంగళవారం అలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో కూడా సదరు ఉద్యోగి మద్యం తాగి విధి నిర్వహణకు రావడం పట్ల అప్పటి జిల్లా అధికారి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా అదేవిధంగా మళ్లీ ఆ ఉద్యోగి మద్యం తాగి విధుల్లోకి రావడం, తాజాగా కార్యాలయంలోనే మద్యం తాగడంపై జిల్లా ఉన్నతాధికారి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇటీవల రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ దాడులు జరిగినప్పటికీ అధికారుల తీరుమాత్రం మారక పోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా రవాణా శాఖ అధికారి ఎండీ గౌస్ పాషాను వివరణ కోరగా కార్యాలయంలో మద్యం సేవిస్తూ ఉద్యోగం చేయడం సరికాదన్నారు. విషయం తెలిసిన వెంటనే సదరు ఉద్యోగిని రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి సరెండర్ చేశామని తెలిపారు.

టీఎస్ఈపై వేటు..

● డీటీఓపై విచారణ

హసన్‌పర్తి: మహబూబాబాద్ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్‌పై విధులు నిర్వర్తిస్తున్న టెక్నికల్ సపోర్ట్ ఇంజనీరింగ్ (టీఎస్ఈ) సురేశ్‌పై వేటు పడింది. అతడిని విధుల నుంచి తప్పిస్తూ హనుమకొండ డీటీసీ శ్రీనివాస్ పుప్పాల ఆదేశాలు జారీ చేశారు. మద్యం తాగి విధులకు హాజరయ్యారనే ఆరోపణలపై సురేశ్‌ను ఉద్యోగం నుంచి తొలగించినట్లు డీటీసీ తెలిపారు.

డీటీఓపై విచారణ..

మహబూబాబాద్ జిల్లా డీటీఓగా విధులు నిర్వహిస్తున్న గౌస్‌పాషాపై విచారణ జరుపుతున్నట్లు డీటీసీ శ్రీనివాస్ పుప్పాల చెప్పారు. విచారణ అనంతరం చర్యల నిమిత్తం రవాణాశాఖ కమిషనర్‌కు నివేదిక అందజేయనున్నట్లు డీటీసీ డాక్టర్ శ్రీనివాస్ పుప్పాల తెలిపారు.



అమ్మలా ఆలనాపాలన..

వదిలేసిన శిశువులకు అమ్మ ఒడినందిస్తున్న 'శిశుగృహ'



హనుమకొండలోని శిశు గృహ ఎదుట ఊయలలు



శిశుగృహలో ఊయలలు

- 2005లో హనుమకొండలో ప్రారంభం
- పిల్లలు ఇష్టం లేని తల్లిదండ్రులు ఊయలలో వేయండి
- సంస్థ నిర్వాహకుల విజ్ఞప్తి

కాజీపేట అర్బన్ : ఆడపిల్ల.. ఇంటికి వెలుగు. ఎక్కడ ఆడపిల్ల ఉంటుందో ఆ ఇల్లు సిరిసంపదలతో తులదూగుతుంది. అలాగే, అంగవైకల్యం గల వారు దేవుడితో సమానం. ప్రస్తుత సమాజంలో ఈ విషయంపై అవగాహన లేని కొందరి తల్లిదండ్రుల వల్ల ఆడ, అంగవైకల్య శిశువులు ఇంకా నిరాదరణకు గురవుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహించినా వారు మారడం లేదు. అప్పుడే జన్మించిన ఆడ, అంగవైకల్యం కలిగిన శిశువులను వదిలించుకుంటున్నారు. ముళ్ల కంపలు, చెత్తకుండీలు, నీటి కుంటల్లో వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో అభం శుభం తెలియని శిశువులను కుక్కలు, పందులు పీక్కుతింటున్నాయి. మానవత్వం మంటకలిసిపోయే ఈ ఘటనలు రోజూ ఎక్కడో చోట జరుగుతూనే ఉన్నాయి.

అమ్మఒడినందిస్తున్న శిశుగృహ

తల్లిదండ్రులు కోల్పోయిన అనాథలు, వివిధ లోపాలతో అప్పుడే పుట్టిన శిశువులకు 'శిశుగృహ' అమ్మ ఒడినందిస్తోంది. కన్న వారి తిరస్కరణ నుంచి అన్నీ తానై ఆలన, పాలనతో చేరదీస్తోంది. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 2005 సంవత్సరంలో శిశు సంరక్షణ, రక్షణకు హనుమకొండలో శిశుగృహను ప్రారంభించారు. శిశువుల సంరక్షణతో పాటు దత్తతకు అనువుగా కేంద్ర శిశు సంక్షేమ శాఖ 2015లో ఆన్‌లైన్‌లో దత్తత ప్రక్రియ ప్రారంభించింది. ఫలితంగా మాతత్వం కోసం ఎదురుచూసే దంపతులకు దత్తత అందించేందుకు శిశు గృహ కేరాఫ్‌గా మారింది.

నిరాదరణకు గురైన శిశువులను ఊయల్లో వదిలివేస్తే చాలు..

తల్లిదండ్రుల నిరాదరణకు గురైన అప్పుడే పుట్టిన శిశువులను శిశుగృహ ఏర్పాటు చేసిన ఊయల్లో వదిలివేస్తే చాలు.. అన్ని తామై చూసుకుంటూ అనాథలకు అమ్మ ఒడినందిస్తోంది. శిశుగృహలో శిశువుల రక్షణ, సంరక్షణకు మేనేజర్ పర్యవేక్షణలో ఒక సోషల్ వర్కర్ దత్తతకు, డాక్టర్, నర్స్, ఆలన పాలనకు ఆరుగురు ఆయాలు, సెక్యూరిటీ గార్డుల సంరక్షణలో శిశుగృహ సేవలందిస్తుంది.

దత్తతకు కేరాఫ్..

పుట్టిన బిడ్డను వదిలేయాలనే తల్లిదండ్రుల నుంచి పిల్లలు కావాలని మాతృత్వపు మమకారానికి అమ్మానాన్న అని పిలుపు కోసం ఎదురుచూసే దంపతులకు అనాథలను అందజేసేందుకు శిశుగృహ దత్తతకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఆన్‌లైన్‌లో www.cara.wcd.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే చాలు దత్తతకు నిబంధనలకు అనుగుణంగా శిశువులను అందజేస్తారు. దేశీయ, విదేశీయ దత్తతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు.

మాతృత్వం కోసం దత్తత



పిల్లలు లేని దంపతులకు మాతృత్వం అందించేందుకు దత్తత ప్రక్రియ తోడ్పడుతుంది. ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న దంపతులకు దత్తత ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా శిశువులను అందజేస్తాం. అనాథలకు అమ్మానాన్నలను, పిల్లలు లేని వారికి వారసులను అందజేసేందుకు దత్తత ప్రక్రియ తోడ్పడుతుంది.

-దూడం నగేశ్, శిశుగృహ మేనేజర్

విదేశీయులకు కూడా..



శిశుగృహ సంరక్షణలో ఉన్న శిశువులను దత్తత దరఖాస్తులకు అనుగుణంగా అందజేస్తాం. శిశు గృహ ప్రారంభించిన నాటి నుంచి 196 దేశీయ, 10 యూఎస్ఏ, ఇటలీ వంటి విదేశీయులకు దత్తత ఇచ్చాం. పిల్లల సంరక్షణ చేయలేని తల్లిదండ్రులు ముళ్లకంపలు, చెత్తకుండీల్లో వేయొద్దు. ఊయల్లో వదిలేస్తే పిల్లలను రక్షించి దత్తత ద్వారా మరోజన్మ ఇస్తాం.

-సంగి చైతన్య , సోషల్ వర్కర్

జైలుకెళ్లినా మారని ప్రవర్తన

- గంజాయి స్మగ్లర్ అరెస్ట్
- 22 కిలోల ఎండు గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

కాజీపేట: ఓ యువకుడు సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. దీనికి గంజాయి విక్రయమే మార్గమని భావించాడు. అనుకున్నదే తడవుగా పుణెలో గంజాయి కొనుగోలు చేసి రైల్వే స్టేషన్లలో విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకుని జైలుకు పంపించగా ఇటీవలే విడుదలయ్యాడు. అయినా అతడి ప్రవర్తన మారలేదు. మరోసారి ముంబైలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి కాజీపేట జంక్షన్‌లో విక్రయించడానికి వచ్చి పోలీసులకు పట్టుబడ్డాడు. కాజీపేట సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. ఎస్సై శివకృష్ణ మంగళవారం మధ్యాహ్నం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కాజీపేట రైల్వే జంక్షన్ పరిసర ప్రాంతంలో ఓ వ్యక్తి సూట్ కేసు, బ్యాగుతో కనిపించాడు. ఎస్సైకి అనుమానం వచ్చి సదరు యువకుడిని ఆపి వివరాలు అడగడానికి యత్నించారు. దీంతో ఆ యువకుడు పరార్ కావడానికి యత్నించగా పోలీసులు అప్రమత్తమై పట్టుకున్నారు. బ్యాగులను తనిఖీ చేయగా రూ. 5.50 లక్షల విలువైన 22 కిలోల శుద్ధి చేసిన ఎండు గంజాయి లభించింది. అనంతరం అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా రాష్ట్రానికి చెందిన అఖిల నాయక్ బిపిన్ కుమార్‌గా తేలింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి విచారణ జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

అయాన్స్‌కు కన్నీటి వీడ్కోలు



అయాన్స్ (ఫైల్)

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్నముప్పారానికి చెందిన దర్శనం వెంకన్న, రేణుక దంపతుల రెండో కుమారుడు దర్శనం అయాన్స్‌కు కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. కుక్క దాడిలో గాయపడి చికిత్సపొందుతూ మృతి చెందిన (42 రోజుల) పసికందు అయాన్స్ అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. కాగా, సోమవారం తొర్రూరు మండలం మడిపల్లిలో అమ్మమ్మగారి ఇంటివద్ద ఉన్న అయాన్స్‌పై కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వెంటనే ఎంజీఎం తరలించగా అదేరోజు రాత్రి మృతి చెందిన విషయం విదితమే.

మేడిగడ్డలో 20వ గేటు తొలగింపు ముమ్మరం



సగం వరకు తొలగించిన 20వ రేడియల్ గేటు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మి)బ్యారేజీలో 7వ బ్లాక్‌లో 20వ గేటు విడిభాగాల తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంగళవారం 20వ రేడియల్ గేటు పనుల విడిభాగాలను సగం వరకు తొలగించారు. ఇదివరకు 7వ బ్లాక్‌లోని 12, 13, 14, 15, 16, 17, 18, 19, 21, 22 గేట్లను ఇంజనీరింగ్ అధికారులుపైకి ఎత్తారు. దీంతో విడిభాగాల తొలగింపు పనుల్లో వేగం పెరగడంతో రెండు రోజుల్లో పూర్తిగా తొలగించనున్నట్లు ఇంజనీరింగ్ వర్గాలు తెలిపాయి.

'ఎస్‌డీఎల్‌సీఈ'లో ఒకరికి బదులు మరొకరు..

● పరీక్ష రాస్తూ పట్టుబడిన అభ్యర్థులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం 13 కేంద్రాల్లో ఎస్‌డీఎల్‌సీఈ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ ఫైనల్ ఇయర్ పరీక్షలు నిర్వహించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో మొత్తం1213 మంది విద్యార్థులు హాజరుకావాల్సిండగా 803 మంది హాజరయ్యారు. 410 మంది గైర్హాజరయ్యారని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ తెలిపారు. జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ పరీక్ష కేంద్రంలో ఇద్దరి విద్యార్థులకు బదులు మరో ఇద్దరు పరీక్ష రాస్తూ పట్టుబడ్డారు. అక్కడి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నర్సయ్య పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. పోలీసులు వచ్చి ఆ ఇద్దరిని అదుపులోనికి తీసుకున్నారన్నారు. పరీక్ష రాయాల్సిన అసలు ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు వారు తెలిపారు. ఒకరికి బదులు మరొకరు రాస్తూ పట్టుబడిన వారిలో ఓ అమ్మాయి కూడా ఉందని చీఫ్ సూపరింటెండెంట్ నర్సయ్య తెలిపారు.

చేయి కోల్పోయిన ఘటనపై విచారణ


● 'సాక్షి ' కథనానికి తెలంగాణ వైద్య మండలి స్పందన



' సాక్షి'లో ప్రచురితమైన కథనం

ఎంజీఎం : ఐనవోలుకు చెందిన గందెపల్లి ఉప్పలమ్మ మే 30న అస్వస్థతకు గురైంది. దీంతో అందుబాటులో ఉన్న ఆర్ఎంపీ పబ్బోజు సంపత్ వద్దకు చికిత్స నిమిత్తం ఇంటికి పిలిచారు. ఈ క్రమంలో ఆర్ఎంపీ.. ఉప్పలమ్మ ఎడమ చేతికి సెలైన్ పెట్టడంతో రక్తం సరఫరా ఆగిపోయింది. దీంతో ఇన్ఫెక్షన్ కావడంతో ఎంజీఎంలో మోచేతి పై వరకు తొలగించారు. ఇదే విషయంపై 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితం కాగా సుమోటోగా స్వీకరించిన తెలంగాణ వైద్య మండలి విచారణ కమిటీని నియమించింది. డాక్టర్ శేషుమాధవ్ నేతృత్వంలోని బృందం సదరు పేషెంట్, వారి కుటుంబ సభ్యులను ఎంజీఎం ఆస్పత్రిలో పరామర్శించి, ఉప్పలమ్మ, ఆమె కోడలు అపర్ణ, కుటుంబ సభ్యుల ద్వారా జరిగిన సంఘటన వివరాలను సేకరించారు. చేయి తొలగించడం వల్లనే ఉప్పలమ్మకు ప్రాణాపాయం తప్పిందని కమిటీ నిపుణులు అభిప్రాయపడ్డారు. పూర్తి వివరాలను హైదరాబాద్‌లోని వైద్య మండలికి నివేదిక తయారు చేసి పంపనున్నట్లు తెలిపారు. సదరు నకిలీ వైద్యుడి పై ఎన్ఎంసీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. విచారణ కమిటీలో వరంగల్ యాంటీ క్వాకరీ అసోసియేట్ సభ్యులు డాక్టర్ వద్దిరాజు రాకేశ్, శిరీశ్ ఉన్నారు.

80 సీట్లతో పీహెచ్‌డీ అడ్మిషన్ల జాబితా



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ కేటగిరీ–1 అడ్మిషన్లలో మిగిలిన 72 సీట్లను రెండో కేటగిరీలోకి మార్చేశారు. పార్ట్–1 కేటగిరీలో మిగిలిపోయిన 72 సీట్లతో పాటు రెండో కేటగిరీ అడ్మిషన్లలో మిగిలిన 8 సీట్లను కలిపి మొత్తం 80 సీట్లతో రూపొందించిన జాబితాతో రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి పాలక మండలి సమావేశంలో చర్చించాలని మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈమేరకు జాబితాను కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. అయితే కేయూ పాలకమండలి సమావేశం నిర్వహించరా లేదా అనేది స్పష్టత లేదు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో కాకతీయ యూనివర్సిటీ ఫైనాన్స్ కమిటీ సమావేశం నిర్వహించారని సమాచారం.

తల్లి చనిపోయిందనే మనోవేదనతో..

- తనయుడి ఆత్మహత్య
- దుర్గాకాలనీలో ఘటన



సన్నీ మృతదేహం

హసన్‌పర్తి: తల్లి చనిపోయిందనే మనోవేదనతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కేయూ పీఎస్ పరిధిలోని దుర్గా కాలనీ (హనుమకొండ)లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన రంగస్వామి సన్నీ(16) ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఎనిమిది నెలల క్రితం తల్లి చనిపోయింది. అప్పటి నుంచి సన్నీ మానసికంగా కృంగిపోతున్నాడు. కాగా, మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు.

ఆదుకుందాం.. బతుకునిద్దాం..

సెల్యూజర్ వ్యాధితో బాధపడుతున్న మహిళ

- చికిత్సకు ఇప్పటికే రూ.3 లక్షల వరకు ఖర్చు
- మరో రూ.5 లక్షలు అవుతాయంటున్న వైద్యులు
- దాతలు ఆదుకోవాలని కుటుంబీకుల వేడుకోలు



చికిత్స పొందుతున్న యాకమ్మ



దీన గాథ

నల్లబెల్లి : అప్పటి వరకు పొలం పనులు చేసి కుటుంబీకులతో సంతోషంగా గడిపిన ఆ మహిళ ఒక్కసారిగా స్పృహతప్పి కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు సెల్యూజర్ (మెదడులో రక్తం గడ్డ కట్టడం) వ్యాధిగా నిర్ధారించారు. దీంతో వైద్యానికి డబ్బు లేక నిరుపేద కుటుంబీకులు తల్లడిల్లుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన తేజావత్ తీతామస్–యాకమ్మ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన యాకమ్మ ఈనెల 7వ తేదీన (శుక్రవారం) రాత్రి ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చు అయింది. వైద్యానికి మరో రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టిమిట్టాడుతున్నారు. దీనిపై దాతలు స్పందించి సాయం చేసి బతుకునివ్వాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.

దాతలు.. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం నంబర్: 63018 21622,
పేరు : తేజావత్ రాజేశ్, బ్యాంక్ పేరు: ఇండియన్ పోస్ట్ బ్యాంక్ అకౌంట్ నంబర్:
052210092280, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: IPOS0000 DOP సాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రగతిలో వరంగల్ డీసీసీబీ

● చైర్మన్ మార్నేని రవీందర్ రావు



మాట్లాడుతున్న చైర్మన్ రవీందర్ రావు

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని ఆ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ మార్నేని రవీందర్ రావు అధ్యక్షతన మేనేజింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డీసీసీబీ మూడు నెలల ప్రగతిపై సమీక్షించారు. రవీందర్ రావు మాట్లాడుతూ రైతులకు రుణాల జారీ సులభతరం చేశామన్నారు. ఏటా బ్యాంకు లాభాలు పెంచుకుంటున్నామన్నారు. అదే విధంగా అధికారులు, సిబ్బంది డిపాజిట్లు సేకరించాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర రెడ్డి, జిల్లా సహకార అధికారి నాగేశ్వరరావు, తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్ లతాజాదవ్, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, డీసీసీబీ సీఈవో ఎండీ వజీర్ సుల్తాన్, జీఎం శ్రీధర్, డీజీఎంలు రోహిణి, కురువ నాయక్, ఏజీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వృద్ధుడి నిరసన



మండల కేంద్రంలో నిరసనతో నిలిచిన ట్రాఫిక్



బాధితుడు రాయమల్లు

టేకుమట్ల : 'భూమి విక్రయించిన డబ్బులు ఇవ్వమంటే, మొత్తం నగదు ఇచ్చానంటూ పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సతీమణి బండారి రాధికారాణి దాటవేస్తున్నరు. దీనిపై నాకు న్యాయం చేయాలి' అని మండలంలోని ఆరెపల్లికి చెందిన ఇటుకాల రాయమల్లు మంగళవారం పురుగుల మందు డబ్బాతో మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి రోడ్డుపై నిరసన చేపట్టడంతో సుమారు 45నిమిషాల పాటు ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడికి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కరిస్తామని తెలపడంతో నిరసన విరమించారు. అనంతరం రాయమల్లు మాట్లాడుతూ.. అనారోగ్యం కారణంగా తన వ్యవసాయ భూమిలో 39 గుంటల భూమిని రూ.13.65 లక్షలకు విక్రయించానన్నారు. మొదటి విడతలో రూ.7లక్షలు ఇచ్చి, మిగతా మొత్తాన్ని భూమి రిజిస్ట్రేషన్ రోజు ఇస్తామని నమ్మబలికి, రిజిస్ట్రేషన్ రోజు డబ్బులు ఇచ్చి తనతో ఫొటో దిగాక, ఇంటి వద్ద ఇంత డబ్బును ఎలా తీసుకెళ్తావు కారులో పెట్టుకోమని తెలిపారన్నారు. రిజిస్ట్రేషన్ అయ్యాక డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు డబ్బుల ప్రస్తావన తీసుకొచ్చినా నీకు ఇవ్వాల్సిన డబ్బులను ఇచ్చేశాం.. మిగతా డబ్బులు ఎక్కడివంటూ అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదే విషయంపై గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసానని, చేసేదేం లేక రోడ్డుపై నిరసన చేసానన్నారు. కాగా బండారి రాధికారాణిని వివరణ కోరగా ఇవ్వాల్సిన మొత్తం కేవలం రూ.65 వేలు అని, పూర్తి ఆధారాలు ఉన్నాయని, తమపై కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు.

లోన్ పేరుతో మోసం..

- రూ. 57వేలు పోగొట్టుకున్న యువకుడు
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

శాయంపేట : ఫేస్‌బుక్‌లో 'దని' పేరిట లోన్ యాప్‌పై క్లిక్ చేసి ఓ యువకుడు మోసపోయాడు. లోన్ మంజూరు చేస్తామని మోసగాళ్లు ప్రాసెసింగ్ ఫీజు పేరుతో రూ. 57వేలు ఫోన్ పే చేయించుకున్నారు. లోన్ మంజూరుకు ఇంకా ఫీజు కావాలని అడిగారు. దీంతో మోసపోయానని గ్రహించిన సదరు యువకుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన ఆకునూరి కోటి సోమవారం తన స్మార్ట్ ఫోన్‌లో ఫేస్‌బుక్ చూస్తుండగా 'దని' లోన్ యాప్ సమాచారం వచ్చింది. లోన్ కావాలంటే కాల్ అనే ఆప్షన్ మీద క్లిక్ చేయండి అనే వివరాలు కనిపించాయి. దీంతో క్లిక్ చేయగా సదరు యాప్ నిర్వాహకులకు కాల్ కనెక్ట్ అయింది. దీంతో లోన్ ప్రాసెసింగ్ కావాలంటే ఫీజు చెల్లించాలంటూ సోమవారం నుంచి మంగళవారం వరకు పలుమార్లు అతడి వద్ద రూ. 57వేలు ఫోన్ పే ద్వారా తమ బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అయినా లోన్ మంజూరు చేయకుండా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలంటూ ఇంకా అడుగుతుండడంతో కోటికి అనుమానం వచ్చింది. మోసపోయానని గ్రహించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో 1930కు కాల్ చేసి మోసానికి సంబంధించిన వివరాలు సైబర్ పోర్టల్‌లో నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేసి ఘటన జరిగిన గంటలోపే వివరాలను సైబర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. తద్వారా బాధితుల అకౌంట్ నుంచి వేరే అకౌంట్‌లో జమ అయిన డబ్బు వెంటనే హోల్డ్ అవుతుందన్నారు. ఆ డబ్బును కోర్టు ద్వారా బాధితులకు చెల్లించే అవకాశం ఉంటుందని ఎస్సై తెలిపారు.

కేసు పెడతారనే భయంతో.. వ్యక్తి ఆత్మహత్య

కన్నాయిగూడెం : మండలంలోని మల్కపల్లికి చెందిన పద్దెం లక్ష్మయ్య(32) కేసు పెడతారనే భయంతో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం .. మల్కపల్లికి చెందిన పద్దెం లక్ష్మయ్య, మడకం జోగయ్య, బండయ్య, మడవి చుక్కయ్య బుట్టాయి గూడెం గ్రామానికి చెందిన సునార్కని లక్ష్మయ్య, జనగం సమ్మయ్యకు చెందిన సుమారు నాలుగు ఎకరాల పోడు భూమిని నరికారనే సమాచారంతో ఫారెస్టు అధికారులు పోలీస్ స్టేషన్‌లో వీరిపై ఫిర్యాదు చేశారు. దీంతో విషయం తెలుసుకున్న పద్దెం లక్ష్మయ్య తనపై కేసు పెడతారనే భయంతో పురుగుల మందు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీ

● ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

కమలాపూర్: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి కమలాపూర్ మండలం మాదన్నపేట–శనిగరం గ్రామాల మధ్య జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. శనిగరం గ్రామానికి చెందిన గోపరవేని సిద్ధు (19)తో పాటు మరో ముగ్గురు యువకులు ఒకే బైక్‌పై మాదన్నపేట వైపు నుంచి శనిగరం వస్తున్నారు. ఈ క్రమంలో శనిగరం–మాదన్నపేట గ్రామాల మధ్య ఉన్న అల్లికుంట వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్ధు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మిగతా ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ హరికృష్ణ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించారు.